క్లుప్తంగా

అంత్యక్రియలకు ఆర్థికసాయం


రూ.10వేలు అందజేస్తున్న విజయ్‌కుమార్

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని శాంతినగర్‌లో నివాసముండే వరుణ్ భార్య మానస (22) మంగళవారం గుండెపోటుతో మరణించింది. నిరుపేదలు కావడంతో మృతురాలి అంత్యక్రియల నిర్వహణ కోసం హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ రూ.10వేలు అందజేశారు.

చందానగర్ ఉపకమిషనర్‌గా ముకుందరెడ్డి



హఫీజ్‌పేట్ : చందానగర్ సర్కిల్– 20 ఉప కమిషనర్‌గా ముకుంద రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు సుధాంష నందగిరి విధులు నిర్వహించగా సాధారణ బదిలీలలో భాగంగా ఆయన సికింద్రాబాద్ సర్కిల్‌కు వెళ్ళగా, బేగంపేట్ సర్కిల్ ఉప కమిషనర్‌గా ఉన్న ముకుందరెడ్డి చందానగర్ సర్కిల్‌కు వచ్చారు.

శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్‌గా రజనీకాంత్‌రెడ్డి



శేరిలింగంపల్లి: జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా జి.రజనీకాంత్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. జూబ్లీహిల్స్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన ఆయనను శేరిలింగంపల్లి సర్కిల్‌కు బదిలీచేశారు. ఇప్పటి వరకు శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన వెంకన్న చార్మినార్ జోనల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

సర్కిల్‌లో జీహెచ్‌ఎంసీ అధికారుల పర్యటన

రోడ్లు, నీరు నిలిచే ప్రాంతాల పరిశీలన


గచ్చిబౌలి ప్రధాన రోడ్డును పరిశీలిస్తున్న సర్కిల్ ఈఈ శ్రీనివాస్, ఇతర అధికారులు

రాయదుర్గం: భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యం.. మూడు రోజులుగా కురుస్తున్న ముసురువానకు జీహెచ్‌ఎంసీ అధికారులు బుధవారం సర్కిల్‌లో పర్యటించారు. శేరిలింగంపల్లి సర్కిల్ ఈఈ శ్రీనివాస్, డీఈ విశాలాక్షి, ఏఈ జగదీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, సిబ్బంది గచ్చిబౌలి, కొండాపూర్, శేరిలింగంపల్లిలోని ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లును పరిశీలించారు. ముఖ్యంగా ప్రధాన రోడ్లపై వర్షపునీరు నిల్వ ఉండే, పారే ప్రాంతాలను పరిశీలించి వరదనీరు పారేలా చర్యలు తీసుకున్నారు. అలాగే ప్రధాన రోడ్లపై మ్యాన్‌హోల్స్‌ను సరి చేయించారు. రోడ్లపై గుంతలను పూడ్చించారు.

స్టార్టప్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు



రాయదుర్గం: స్టార్టప్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేయడమే లక్ష్యంగా టీ వర్క్స్‌తో డస్సాల్ట్ సిస్టమ్స్ సంస్థ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. బుధవారం రాత్రి హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ-వర్క్స్ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రెండు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. టీవర్క్స్ సీఈఓ, తెలంగాణ ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ డైరెక్టర్ సుజయ్ మాట్లాడుతూ స్టార్టప్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేయడానికి డస్సాల్ట్ సిస్టమ్స్‌తో భాగస్వామ్యం చేసుకోవడంతో 3డి ఎక్స్‌పీరియన్స్ వర్క్స్ వంటి సరికొత్త సాంకేతికతలతో కేంద్రాన్ని మరింత సన్నద్ధం చేయడం సాధ్యమవుతుందన్నారు.

కార్ కేర్ స్టూడియోలు

సాక్షి సిటీబ్యూరో: అత్యాధునిక కార్లకు సంబంధించిన సేవలకు పేరొందిన చికాగో కంపెనీ టర్టెల్ వ్యాక్స్, ఇంక్ నగరంలో తమ బ్రాండెడ్ కార్ కేర్ స్టూడియోలను ఏర్పాటు చేసింది. నగరానికి చెందిన జెనెక్స్, ఇండియన్ డెకార్స్‌తో కలిసి నెలకొల్పిన వీటిని బుధవారం ప్రారంభించారు. మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీ, కేపీహెచ్‌బీ కాలనీ 5వ ఫేజ్, బంజారాహిల్స్‌లో వీటి సేవలు అందుబాటులోకి తెస్తున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు.



బస్టాపులు, గేటెడ్ కమ్యూనిటీల వద్ద గొడుగులతో వేచి ఉన్న తల్లిదండ్రులు

ముసురుకుంది..

మూడు రోజులుగా ఇక్కట్లు


స్కూల్ నుంచి కుమారుడిని తీసుకెళుతున్న తండ్రి

గచ్చిబౌలి: మూడురోజులుగా ముసురు వర్షం కురుస్తూనే ఉంది. ఆగకుండా వర్షం పడుతూనే ఉండడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఉద్యోగులు విధులకు, విద్యార్థులు స్కూళ్లకు వర్షంలోనే రాకపోకలు సాగించారు. విద్యాసంస్థల సమయాలు ముగిసిన తర్వాత ఇళ్ళకు వచ్చే సమయంలో తల్లిదండ్రులు బస్సులు ఆగే చోట, గేటెడ్ కమ్యూనిటీ ప్రధాన గేట్ల వద్ద తల్లిదండ్రులు గొడుగులు పట్టుకొని వేచి ఉండడం కనిపించింది. కాగా జంట సర్కిళ్ళ పరిధిలోని పలు బస్తీలలో అంతర్గత రోడ్లు జలమయం కావడంతో బాటు బురదమయంగా తయారయ్యాయి. దీంతో పాదచారులు అవస్థలుపడ్డారు. కాగా జీహెచ్‌ఎంసీ అధికారయంత్రాంగం కాలనీలు, బస్తీలపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాలేదు.

శిల్పారామం, దుర్గం చెరువు వెలవెల

మాదాపూర్: వర్షానికి శిల్పారామం వెలవెలబోతోంది. ప్రతి రోజు వందలాది మంది సందర్శకులు వచ్చేవారని రెండు రోజుల నుండి కనీసం 50 మంది కూడా రావడం లేదని నిర్వాహకులు తెలిపారు.

బోటింగ్ బంద్

వర్షం కారణంగా మాదాపూర్‌లోని దుర్గం చెరువులో బోటింగ్‌ను నిలిపివేశారు. సందర్శకులు లేక బోటింగ్ ఆగిపోయింది.


ఖాళీగా గచ్చిబౌలి ప్రధాన రోడ్డు


ఆర్డర్ డెలివరీకి వెళుతున్న జొమాటో బాయ్



నిర్మానుష్యంగా శిల్పారామం, దుర్గం చెరువు

20మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమ, మంగళవారాలలో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 20 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 19 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున జరిమాన, ఒకరికి మూడు వేల జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

పటాన్‌చెరు: భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని అన్ని స్థాయిల అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సూచించారు. వర్షాల నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో మాట్లాడారు. ప్రధానంగా వరద ముంపు ప్రభావిత ప్రాంతాలలో పర్యటించాలని కోరారు. మండల స్థాయిలో కంట్రోల్ రూం లు ఏర్పాటు చేసి విద్యుత్తు, రెవెన్యూ, పోలీస్‌శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో చెరువులకు గండ్లు పడకుండా చూడాలని ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ, మున్సిపాలిటీల పరిధిలో డీఆర్‌ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

బీఎల్‌ఓలకు శిక్షణ

పటాన్‌చెరు టౌన్: స్వచ్ఛమైన ఓటర్ జాబితాను సిద్ధం చేసేందుకు బీఎల్‌ఓలు కృషి చేయాలని పటాన్‌చెరు తహసీల్దార్ పరమేశం అన్నారు.బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎల్‌ఓ, సూపర్‌వైజర్‌లకు ఓటర్ జాబితాపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పరమేశం మాట్లాడుతూ... స్వచ్ఛమైన ఓటర్ జాబితా తయారీపై అవగాహన కల్పించారు. ఫారం– 6 కొత్త ఓటర్ నమోదు, 6(ఎ)ఎన్‌ఆర్‌ఐ, 6(బి)ఆధార్ లింక్, ఫారం– 7 డిలిషన్, ఫారం– 8 తప్పుల సవరణ తదితరాలపై పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ సంతోష్ కుమార్, మాస్టర్ ట్రైనర్ అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ కుటుంబానికి ఆర్థిక సహాయం


ఎస్‌ఐ కుటుంబానికి చెక్కు అందిస్తున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర

రాయదుర్గం: సబ్ ఇన్‌స్పెక్టర్ కుటుంబానికి తోటి సిబ్బంది అందించిన 10 లక్షల చెక్కును సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర బుధవారం అందించారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్ దుండిగల్ పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్‌రెడ్డి జూన్ 8వ తేదీ గుండెపోటుతో మృతి చెందారు. 2014 బ్యాచ్‌కు చెందిన ప్రభాకర్‌రెడ్డి గతంలో ధారూర్, యాలాల్, తాండూర్, కొడంగల్ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహించారు. ఆయనకు భార్య, కూతురు అక్షయ ఉన్నారు. మేడ్చల్ డీసీపీ సందీప్ ఆధ్వర్యంలో జోన్ పోలీస్ సిబ్బంది తమ వంతు సాయంగా రూ.10 లక్షలు జమ చేసి ప్రభాకర్‌రెడ్డి భార్య లక్ష్మీప్రసన్న, తల్లిరమాదేవి, తండ్రి సాగర్‌రెడ్డికి అందించారు. కార్యక్రమంలో మేడ్చల్ డీసీపీ సందీప్, ఏసీపీ వెంకట్‌రెడ్డి, దుండిగల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


గ్రామ దుకాణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : మహిళలు స్వయం ఉపాధితో పాటు ఆర్థికంగా రాణించే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం భారతీనగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీలో నాబార్డ్ సహకారంతో ఈశ్వరాంబ మహిళా సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా సంఘాల ఉత్పత్తుల గ్రామ దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు అందించడంతో పాటు మహిళా పారిశ్రామిక వేత్తలకు రుణాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు వెన్నవరం సింధు ఆదర్శ్ రెడ్డి, పుష్పనగేష్, తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, నాబార్డ్ జిల్లా మేనేజర్ కృష్ణ తేజ ,నాయకులు రాణీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతే లక్ష్యం


శివమ్మ కాలనీలో పర్యటిస్తున్న యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: గుడ్‌మార్నింగ్ ఆల్విన్‌కాలనీలో భాగంగా బీఆర్‌యస్ పార్టీ యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్ బుధవారం డివిజన్ పరిధిలోని శివమ్మ కాలనీలో పార్టీ నాయకులతో కలిసి పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల శుభ్రతే లక్ష్యంగా వీధుల్లో చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించానన్నారు. శివమ్మకాలనీలో డ్రైనేజీలైన్‌లలో మట్టి పేరుకుపోయి పూడుకుపోతున్నాయని, మూడు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు అవసరమైన విషయాన్ని గుర్తించామని వీటిని ఎమ్మెల్యే గాంధీ దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు శివరాజ్ గౌడ్, సిద్దయ్య, షౌకత్ ఆలీ మున్నా, సంగమేష్, కూర్మయ్య, సంతోష్ బిరాదర్, గిరి, జే.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి


విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్స్ అందజేసిన సంస్థ ప్రతినిధులు

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నామని మెడ్వాస్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం చిన్న కంజర్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పార్కర్ హనీ ఇన్ ఇండియా సహకారంతో మెడ్విన్ స్వచ్ఛంద సంస్థ వారు విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసి మెంబర్ వెంకటేశం,హెచ్‌ఎం గీతారాణి ,ఎస్‌ఎంసీ చైర్మన్ కోఆర్డినేటర్ మహబీబ్ పాల్గొన్నారు.

పటాన్‌చెరు ఎస్‌ఐగా నాగేశ్వర్‌రావు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఎస్‌ఐగా నాగేశ్వర్ రావు బాధ్యతలు చేపట్టారు. సంగారెడ్డి వీఆర్‌లో ఎస్‌ఐ గా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వర్ రావు బుధవారం పటాన్‌చెరు ఎస్‌ఐగా బాధ్యతలు తీసుకున్నారు.ప్ర స్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ రామనాయుడు బదిలీపై హత్నూర్ వెళ్లగా, మరో ఎస్‌ఐ ప్రసాద్‌రావు జహీరాబాద్ రూరల్ పోలీసుస్టేషన్‌కు వెళ్లారు.

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో కలినరీ రీట్రీట్

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో భారీగా రూఫ్ టాప్‌బార్, రెస్టారెంట్‌ను కలినరీ రీట్రీట్ పేరిట బుధవారం ప్రారంభించారు. సంస్థ డైరెక్టర్ రూపేష్ సాగర్ మాట్లాడుతూ పరిపూర్ణమైన డైనింగ్ డెస్టినేషన్‌ను రూపొందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఆసియా, పాశ్చాత్య వంటకాలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో హెడ్ చెఫ్ నవీన్‌సింగ్, మిక్సాలజిస్ట్ సాయిరామ్‌గౌడ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మియాపూర్: తాగుడుకు బానిసైన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్‌ఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని ఎంఏనగర్‌లో కూతాడి వేణు (42) భార్య ఉపేంద్ర ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటున్నారు. వేణు ఆటో డ్రైవర్. గత కొంతకాలంగా వేణు తాగుడుకూ బానిసై ఏ పని చేయకుండా ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి వేణు భార్య పిల్లలతో కలిసి అదే కాలనీలో ఉంటున్న తల్లిగారింటికి వెళ్లింది. ఇంట్లో వేణు ఒక్కడే ఉన్నాడు. బుధవారం ఉదయం 7.30 గంటలైనా వేణు నిద్రలేవకపోవడంతో సోదరుడు కుమార్ తలుపు తట్టగా పలుకలేదు. స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా వేణు చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు. మృతుడి సోదరుడు కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

యువతి అదృశ్యం

గచ్చిబౌలి: మహిళ అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గజ్వేల్ జిల్లా రాపోల్ మండలం ఉదయ్‌పూర్‌కు చెందిన అంజయ్య, శాంత దంపతులు నగరానికి వలస వచ్చి గచ్చిబౌలిలోని జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లో నివాసముంటున్నారు. వారికి ఒక కొడుకు, కూతురు ఉన్నారు. కూతురు మమత(25) మాదాపూర్‌లోని ప్రైవేటు చిట్‌ఫండ్ కంపెనీలో పనిచేస్తుంది. రోజు మాదిరిగానే ఇంట్లో చెప్పి ఈనెల 17వ తేదీన ఉదయం 9 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్ళి తిరిగి రాలేదు. రాత్రి 7.30 గంటలకు ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. వెంటనే ఆమె చిట్‌ఫండ్ కంపెనీకి వెళ్ళి ఆరా తీయగా ఆమె ఉద్యోగంలో చేరిన రెండు రోజులు మాత్రమే వచ్చిందని, ఆ తర్వాత మానివేసిందని తెలిపారు. దీంతో తెలిసిన వారు, బంధువులకు ఫోన్ చేసి ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ


విద్యార్థులకు బ్యాగులను అందజేస్తున్న రఘునాథ్‌యాదవ్

శేరిలింగంపల్లి: ఇష్టపడి చదివితేనే విద్యార్థుల భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని రఘునాథ్ ఫౌండేషన్ చైర్మన్ మారబోయిన రఘునాథ్‌యాదవ్ తెలిపారు. రఘునాథ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు స్కూల్ బ్యాగులను బుధవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా రఘునాథ్‌యాదవ్ మాట్లాడుతూ దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. ఆర్థిక కారణాలతో ఏ విద్యార్థి చదువు ఆగకూడదని వారికి రఘునాథ్ ఫౌండేషన్ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎల్. శంకర్, పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి, స్థానిక నాయకులు గఫూర్, రాములు గౌడ్, అక్బర్, సలీం, భరత్‌యాదవ్, పవన్, రాజలింగం, ముక్రమ్, జావేద్, నారాయణ, రషీద్, అలీ, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.


ప్రేమ్‌నగర్‌లో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న నాయకులు

కాంగ్రెస్ నాయకుల పర్యటన

హఫీజ్‌పేట్ : కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్‌లో బుధవారం కాంగ్రెస్ నాయకులు పర్యటించారు. 3 రోజులుగా కురుస్తున్న నానుడు వానకు ప్రేమ్‌నగర్‌లోని రోడ్డు నంబర్ 6లో ముక్రం ఇల్లు వర్షానికి కూలిపోయింది. అలాగే వర్షాల వల్ల ఇబ్బందులు పడుతున్న వారికి ఆర్థిక సహాయం అందించారు. ఈ పర్యటనలో నాయకులు నరేందర్ యాదవ్, ఖాజా పాషా, ఇస్మాయిల్, అఫ్రోజ్ ఖాన్, భరత్‌గాంధీ రెడ్డి, అనిల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తోటి విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ డా.హరీష్


విద్యార్థులతో కరచాలనం చేస్తున్న కలెక్టర్ హరీష్

గచ్చిబౌలి: విద్యార్థుల ప్రవర్తన ఇతరులకు, తోటి విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలని రంగారెడ్డిజిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ హరీష్ సూచించారు.కొండాపూర్‌లోని చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్ ఇన్‌వెస్టిట్యూర్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా బుధవారం విచ్చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ ఎంపిక చేసిన విద్యార్థులకు బ్యాడ్జెస్ ప్రధానం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

148 కిలోల గంజాయి స్వాధీనం

- వ్యక్తి అరెస్ట్ .. పరారీలో ఇద్దరు
- కేసు వివరాలను వెల్లడించిన మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో స్కోడా కారులో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారని మాదాపూర్ డీసీపీ శిల్పవల్లీ తెలిపారు. బుధవారం రాత్రి గచ్చిబౌలిలోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఆమె వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన నకుల్ కైలాస్ గైక్వాడ్(32) విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి ఎక్కువ డబ్బులు సంపాదించాలని గంజాయి వ్యాపారం ప్రారంభించాడు. పెద్దబొడ్డుపల్లి, నర్సీపట్నం, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శివ వద్ద కిలో రూ.5000 చొప్పున 148.66 కిలోల గంజాయిని కొనుగోలు చేశాడు. ముంబైకి చెందిన గంజాయి వ్యాపారి సంతోష్‌కు అమ్మాల్సి ఉంది. నర్సీపట్నం నుంచి విజయవాడ మీదుగా హైదరాబాద్‌కు చేరుకున్నారు. మాదాపూర్‌లోని యశోద హాస్పిటల్ లింకు రోడ్డులో స్కోడా కారులో గంజాయి ఉన్నట్లు మాదాపూర్ ఎస్‌ఐ రవికిరణ్‌కు విశ్వసనీయ సమాచారం అందడంతో ఎస్‌ఓటీ పోలీసులతో కలిసి నిందితుడిని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గతంలోనూ గైక్వాడ్ గంజాయి రవాణ కేసులో రాజమండ్రి పోలీసులు జైలుకు పంపారు. నర్సీపట్నంకు చెందిన శివ, ముంబైకి చెందిన సంతోష్‌లు పరారీలో ఉన్నారు. కార్యక్రమంలో మాదాపూర్ అడిషనల్ డీసీపీ నంద్యాల నర్సింహ్మారెడ్డి, ఏసీపీ పి.శ్రీనివాస్, మాదాపూర్ సీఐ తిరుపతి, ఎస్‌ఓటీ సీఐ శివ, డీఐ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


కేసు వివరాలను వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి